క్లుప్తంగా

వైభవంగా ఆలయాల ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సీతారామ, ఆంజనేయస్వామి, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల ప్రారంభోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటలకు ఆలయాలకు చేరుకున్న భక్తులు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పాలకొండ రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మనం–మన గ్రంథాలయం అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ఇక్కడి మంచి మంచి పుస్తకాలు బాగా చదివి అందులోని మంచి విషయాలను గ్రహించాలని కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన

సీతంపేట: మండలంలోని సోమగండి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ కొండపల్లి సత్యం శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు గమనించిన ఆయన పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలన్నారు.

127 మద్యంసీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ అధికారులు

కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 127 మద్యంసీసాలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎస్ఈబీ ఎస్ఐ బి.వి.ఎన్.భూషణరావు శుక్రవారం తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తి పరారీలో ఉన్నాడని, త్వరలోనే ఆయనను పట్టుకుని అరెస్ట్ చేస్తామన్నారు.

ఆలయ నిర్మాణాలను వేగవంతం చేయండి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాలకు టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) మంజూరు చేసిన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. మండలంలోని వండవ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి శుక్రవారం విచ్చేసిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులతో ఆమె కాసేపు మాట్లాడారు. జిల్లాలో ఒక్క పాలకొండ నియోజకవర్గానికే టీటీడీ రికార్డు స్థాయిలో 100 ఆలయాల నిర్మాణానికి అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కూడా మంజూరు చేసిందని తెలిపారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

భామిని: మండలంలో అర్ధాంతరంగా నిలిచిన ఏబీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించండి అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కోరారు. ఇదే విషయమై శుక్రవారం కలెక్టర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో అటువైపుగా ప్రయాణిస్తున్న వారు పడుతున్న కష్టాలను వివరించి, రోడ్డు పనుల పూర్తికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ అభివృద్ధికి కార్యదర్శులే కీలకం

వీరఘట్టం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులే కీలకమని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన జగనన్న స్వచ్ఛసంకల్పం, ఇంటి పన్నుల వసూళ్లు, ఓడీఎఫ్ కార్యక్రమాలపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడగమ్మలో 'గడప గడపకు'

వీరఘట్టం: మండలంలోని గడగమ్మ గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీతోనే సమన్యాయం

● ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పక్కనే ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు అన్ని విధాలా సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, పార్టీ, కేబినెట్ పదవులతో పాటు సంక్షేమ పథకాలు అందజేయడంలోనూ అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. అమరావతి పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం సెంటు భూమి ఇస్తే దానిని సమాధికి సరిపడే స్థలంగా ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అలాగే రూ.24.5 కోట్ల వ్యయంతో కిమ్మి–రుషింగి వంతెన పనులు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎంపీపీ డి.వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గవరమ్మపేట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి ఉద్యోగుల హాజరుతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో చాలామంది సమయానికి విధులకు హాజరు కావడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, మరోసారి ఇదే పునరావృతం అయితే చర్యలకు వెనకాడేది లేదని హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత

కురుపాం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత చేతుల మీదుగా రైతులకు వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని గ్రామాల్లోని సచివాలయాలకు అనుబంధంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను సకాలంలో ఇస్తోందన్నారు. అన్నదాతలంతా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ అలజంగి నిర్మల, కురుపాం వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగోళ్ల గౌరీశంకరరావు, సర్పంచ్ గార్ల సుజాత తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నపుదొర గ్రామ పంచాయతీ పరిధిలోని సుభద్రమ్మవలస గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రతీ ప్రాంతంలో అక్కడి ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులు చేయడంతో పాటు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులై ఉండి, సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలని, పథకాలు, అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, సర్పంచ్ రెడ్డి అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

సీఆర్‌టీల కొనసాగింపుపై హర్షం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1770 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల(సీఆర్‌టీ)ను 2023–24 విద్యా సంవత్సరానికి గాను రెన్యువల్(కొనసాగింపు) చేయడంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళలు మాత్రమే సీఆర్‌టీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో కొన్ని బాలికల పాఠశాలల్లో పురుష పీఈటీలు, పీడీలు, బాలుర పాఠశాలల్లో మహిళా పీఈటీలు, పీడీలు ఉండేవారని, ఈ సంవత్సరం అలాకాకుండా చూడాలన్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు పంపిణీ చేసేందుకు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉల్లిబద్ర గ్రామ రైతు భరోసా కేంద్రంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరైన ఆయన భూసారం పెంచేందుకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌బీకేల ద్వారా రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని తాడికొండ గ్రామంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది దోమల వల్ల కలిగే జ్వరాలు, వాటి బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, ముఖ్యంగా దోమల వల్ల మలేరియా, డెంగీ జ్వరాల బారినపడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తరచూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వీరఘట్టం: డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలంతా ఆర్థికంగా ఎదగాలని డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లు, గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశమైన ఆయన ప్రభుత్వం సంఘాలకు సమకూరుస్తున్న సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. తీసుకున్న రుణాలను సకాలంలో సభ్యులతో చెల్లింపజేయాలన్నారు. సమావేశంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు' పనులు పూర్తి చేయాలి

సీతంపేట: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ బి.ఆదినారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక వైటీసీలో సర్పంచ్‌లు, గ్రామసచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన గ్రామాల్లో తాగునీటి వసతి, కాలువల నిర్మాణం వంటి మొత్తం 128 అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

పనులను వేగవంతం చేయాలని, పనులు జరిగిన వెంటనే బిల్లుల చెల్లింపు కూడా వారం, పది రోజుల్లో జరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కె.సరస్వతి, ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

పాలకొండ: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి వై.వాహిని ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుకు అమ్మిన ప్రతీ దానికి సంబంధించిన బిల్లును రైతుకు అందజేయాలన్నారు.

ఇంటర్మీడియట్ సీట్లు పెంచండి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలురు, బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్, కార్యదర్శి సీతారాం, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఒక్కో గ్రూపులో ఇప్పుడు 40 సీట్ల చొప్పున భర్తీ చేస్తున్నారని, అదనంగా మరో 20 సీట్లు కేటాయిస్తే మరికొంతమందికి చదువుకునే అవకాశం కల్పించినట్లు అవుతుందని తెలిపారు. ఐటీడీఏ పీఓ స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పక్కాగా భూముల రీసర్వే



భూముల రీ సర్వే వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దారు పి.సోమేశ్వరరావు సూచించారు. శుక్రవారం పాలకొండ–వీరఘట్టం రోడ్డు సమీపంలోని పొలాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల మధ్య నెలకొన్న ఎన్నో భూతగాదాలు ఈ సర్వే ద్వారా పరిష్కారమవుతున్నాయని, సర్వేయర్లు కూడా రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. సర్వే తర్వాత కూడా భూ హక్కుదారుల సమస్యలు ఎదుర్కొంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.వెంకటరమణ, సహాయ సర్వేయర్లు జి.గణేష్, నాగరాజు, మణికుమార్, వీఆర్‌ఓలు బి.సాయిశ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచామన్నారు. నియోజకవర్గంలోని 93 ఆర్‌బీకేల్లో 5,690 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో 3,661 క్వింటాళ్ల విత్తనాలను 10 శాతం రాయితీపై, 2,029 క్వింటాళ్ల విత్తనాలను గిరిజనులకు 90 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం పలువురు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు, ఎరువులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, ఏఓ జె.సౌజన్య, పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని పెద్దూరు గ్రామ ఆర్‌బీకేలో సర్పంచ్ హిమరిక ఆదిలక్ష్మి చేతులమీదుగా రైతులకు శుక్రవారం విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ ఉపేంద్రకుమార్

పాలకొండ రూరల్: గడువులోగా జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ సూచించారు. పంచాయతీ పరిధిలో 23 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరావుతో కలిసి, శుక్రవారం పరిశీలించిన ఆయన లబ్ధిదారులంతా నిర్మాణాలు త్వరితగతిన చేపట్టి, పూర్తి చేయాలని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తోందని, వీటిని నిర్మాణ దశల వారీగా చెల్లించడం జరుగుతుందన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

● డీఎస్పీ జి.వి.కృష్ణారావు



ప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు సూచించారు. స్థానిక పట్టణంలోని శ్రీవిజయ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో ఐరడ్(ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్)పై పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలకు అధికారులు నేరుగా వెళ్లి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని డీఎస్పీ సూచించారు. మరోసారి అదేచోట ప్రమాదం పునరావృతం కాకుండా చూడాలన్నారు. దీనికి సంబంధించిన రికార్డు వర్క్ కూడా పూర్తిగా కాగిత రహితం కావాలని, పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో సీఐ మురళీధర్, ఎస్ఐలు, ఆర్ అండ్ బీ, మోటార్ వెహికల్, పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖ, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గర్భిణి ఆరోగ్యం పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహనరావు

కొమరాడ: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహనరావు సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరాడ, కేఆర్‌బీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం గిరిశిఖర గ్రామాల నుంచి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణుల సమస్యలు, వారికి సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రతినెలా విధిగా గర్భిణులు తమ ఆరోగ్యం పరీక్షించుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని, సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.శామ్యూల్ జాన్, సీహెచ్ అరుణ్‌కుమార్ నాయుడు, సీహెచ్‌ఓ బంగారుబాబు, సూపర్‌వైజర్లు విజయకుమారి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్

పాలకొండ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ డొంక త్రినాథులు నేతృత్వంలో పలు అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్షించారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండలంలోని అంపిలి, జంపరకోట, డోలమడ, ఎల్.ఎల్.పురం, ఓని, వాటపాగు గ్రామ సచివాలయాల పరిధిలో 44 అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు మొత్తం రూ.1.2 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులంతా అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టిసారించాలన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాకముడి అనీల్ కుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు పి.షణ్ముఖరావు హాజరై, ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు, దాని ప్రాధాన్యం వివరించారు. చిరుధాన్యాల సాగుకు అవసరమైన విత్తనాలు(రాగులు, కొర్రలు, సామలు)ను వంద శాతం రాయితీపై త్వరలో పంపిణీ చేస్తామని మండలి చైర్మన్ తెలిపారు. అనంతరం పలువురు రైతులకు ఆర్‌జీఎల్–2537, ఎంటీయూ–1064, ఎంటీయూ–106, ఆర్ఎన్ఆర్–15068 రకం విత్తనాలను 90 శాతం రాయితీపై రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.